# నేడు పోలియో చుక్కల పంపిణీ

అల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నేడు నిర్వహించ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారుల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు చిన్నారుల ఆరోగ్యకర భవిష్యత్తుకు భరోసా అని పేర్కొన్నారు. పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత దేశం, రాష్ట్రం, నియోజకవర్గ స్థాపనకు కృషి చేద్దామని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల వద్ద, కాలనీ కమ్యూనిటీహాల్‌లో వివిధ కూడళ్లు, బస్‌స్టాప్‌లు, రైల్వేస్టేషన్ల వద్ద మొబైల్ టీమ్స్ ద్వారా పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమానికి ఏర్పాట్లు చేశామన్నారు. అందరూ సహకరించి పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

**హైదర్‌నగర్ డివిజన్‌లో...**

పోలియో మహమ్మారి నుంచి చిన్నారులను కాపాడేందుకు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 6 నుంచి సాయంత్రం 5 గంటల వరకు హైదర్‌నగర్ డివిజన్‌లో పలు ప్రాంతాల్లో పోలియో చుక్కలను వేస్తామని, కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. డివిజన్ పరిధిలోని సమతానగర్ వార్డు కార్యాలయం, హెచ్‌ఎంటీ హిల్స్ కమ్యూనిటీహాల్, నిజాంపేట్ రోడ్డులోని జెడ్పీహెచ్‌ఎస్ స్కూల్, హైదర్‌నగర్ ప్రైమరీస్కూల్, రాంనరేష్ సాయిబాబా గుడి వద్ద ఈ పోలియో చుక్కలు వేయనున్నట్లు ప్రకటించారు. ఐదేళ్ల లోపు చిన్నారుల తల్లిదండ్రులందరూ తమ చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని సూచించారు.

# సేవాభారతి ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం



మహిళలకు కుట్టు మిషన్లను అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

మోతీనగర్: సేవ చేయడానికి మనసుంటే చాలు వయసుతో నిమిత్తం లేదని సేవా భారతి చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు నిరూపిస్తున్నారని కూకట్‌పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం మూసాపేట డివిజన్ మోతీనగర్ కమ్యూనిటీహాల్‌లో ట్రస్ట్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ పొందిన మహిళలకు ఆయన సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నేడు ఎంతో మంది ధనవంతులు సమాజంలో ఉన్నప్పటికి సేవ చేయాలనే సంకల్పం అందరికీ ఉండదన్నారు. సేవా భారతి ట్రస్టులో ఎక్కువ మంది వయోవృద్ధులే ఉన్నప్పటికీ సమాజానికి ఏదో చేయాలనే దృఢ సంకల్పంతో సేవా భారతి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మహిళలకు కుట్టు శిక్షణ, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ, శీతాకాలంలో పేదలకు దుప్పట్ల పంపిణీ చేయడం అభినందించాల్సిన విషయమని కొనియాడారు. విద్య, వైద్యంపై ఎన్నో కార్యక్రమాలు నిర్వహించామన్నారు. మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, సేవా భారతి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు సీతారామయ్య, సీఎస్ ఆర్ మూర్తి, ఎస్ఎన్. బైరెడ్డి, ఉమా మహేశ్వర రావు, నాయకులు సత్యం గంగపుత్ర, అంబటి శ్రీనివాస్, జోసఫ్, సంజీవ్ పటేల్, విష్ణు, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

## అఖిల భారత తెలుగు సాహితీ సదస్సుకు ఆహ్వానం

మోతీనగర్: వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా 30వ వార్షికోత్సవం సందర్భంగా తూర్పు గోదావరి జిల్లా రచయితల సంఘం సంయుక్త నిర్వహణలో మార్చి 9,10 తేదీల్లో కాకినాడలోని దంటు కళాక్షేత్రంలో జరగనున్న అఖిల భారత తెలుగు సాహితీ సదస్సుకు ప్రముఖ నవల, గీత రచయిత్రి యలవర్తి అనురాధకు ఆహ్వానం అందింది. రెండ్రోజుల పాటు, సుమారు 16 గంటల్లో 8 ప్రసంగ వేదికల్లో తెలుగు భాష, సాహిత్యాల సుదీర్ఘ, సహజ సౌరభాలను తమ ప్రసంగాల ద్వారా వినిపించే అపూర్వమైన అవకాశం 100 మంది దేశ, విదేశీ వక్తలకు దక్కింది. ఈ వేదికలో పాల్గొనేందుకు రచయిత్రి యలవర్తి అనురాధకు అవకాశం వచ్చినందుకు పలువురు ఆమెను అభినందించారు.

# విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి



స్కూల్ వార్షికోత్సవ వేడుకల్లో..

అల్విన్‌కాలనీ: ఉపాధ్యాయులు బోధించే విద్యను విద్యార్థులు అభ్యసించి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని బాలమిత్ర పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ పొట్లపల్లి బాలకృష్ణ పేర్కొన్నారు. శనివారం కూకట్‌పల్లి సర్కిల్ అల్విన్‌కాలనీ భూదేవిహిల్స్‌లోని బాలమిత్ర పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు దేశభక్తి, సంస్కృతి, సాంప్రదాయాలతో కూడిన నృత్యాలు, నాటక ప్రదర్శనలో పాల్గొని చూపరులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి బాలకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చిన్నారులకు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను అందజేసి అభినందించారు. ప్రిన్సిపాల్ మంజుల, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్



మూసాపేట:భరత్‌నగర్ కాలనీలోని విజన్ టాలెంట్ స్కూల్‌లో సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు వివిధ ఆకృతులు, కళాఖండాలను తమ మేధస్సుతో తీర్చిదిద్ది ప్రదర్శనలో ఉంచారు. శరీరంలోని వివిధ అవయవాల పనితీరును చక్కగా వివరించారు. కంపెనీలు, రోడ్లపై వస్తున్న పొల్యూషన్ వాటి నివారణ చర్యలపై విద్యార్థులు నమూనా ద్వారా తెలిపారు. సంవత్సరంలో వచ్చే పండుగలు వాటి విశిష్టతపై ఒకే చోట ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఒక అడవిని ఏర్పాటు చేసి అడవిలో ఉన్న జంతువులను, పక్షులను తీర్చిదిద్ది అడవిలోకి వెళ్లే మాదిరిగా రూపొందించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, చూపరులు వాటిని చూసి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి వేదికలు ఎంతో ఉపయోగపడతాయని, ఆ దిశగా తమ పాఠశాల విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**గౌతమ్‌మోడల్ స్కూల్‌లో..**

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని జయనగర్ కాలనీలోని గౌతమ్ మోడల్ పాఠశాలలో నిర్వహించిన విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనను డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావుతో కలిసి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గౌతమ్ మోడల్ స్కూల్ నిర్వాహకులు నిర్వహించిన విజ్ఞాన ప్రదర్శన విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి వారి ప్రతిభకు పదును పెట్టడానికి ఎంతగానో తోడ్పడుతుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆదర్శ్‌రెడ్డి,లక్ష్మి, శివ, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు,విద్యార్థుల తల్లిదండ్రులున్నారు.

**స్నేహ మోడల్ స్కూల్‌లో..**

భాగ్యనగర్‌కాలనీ: ఇంద్రాహిల్స్ కాలనీలోని స్నేహ మోడల్ స్కూలులో శనివారం సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్ హాజరై విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైన్స్ ఫెయిర్లు నిర్వహించడంతో విద్యార్థుల్లో శాస్త్ర, సాంకేతిక పరిశోధనలపై చిన్ననాటి నుంచే ఆసక్తి పెరుగుతుందన్నారు. విద్యార్థులకు సహకరించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. సౌజన్య రామకృష్ణ, స్నేహ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మమతరాజ్, కరస్పాండెంట్ రాజు, సత్యరాజు అధ్యాపకులు పాల్గొన్నారు.

**ఎస్ఆర్‌డీజీ స్కూల్‌లో..**

భాగ్యనగర్‌కాలనీ: కూకట్‌పల్లి శుభోదయ కాలనీలోని ఎస్ఆర్‌డీజీ స్కూల్‌లో సైన్స్ ఫెయిర్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ అరుణ పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఏటా నిర్వహించే సైన్స్ ఫెయిర్ వల్ల విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసే అవకాశం ఉంటుందన్నారు. ప్రిన్సిపాల్ ప్రభ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**రాజధాని స్కూల్‌లో..**

కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని జగద్గిరిగుట్ట పాపిరెడ్డినగర్‌లోని రాజధాని హైస్కూల్‌లో శనివారం సైన్స్ ఫెయిర్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ట్రాఫిక్ నియంత్రణ, సోలార్ సిస్టమ్, నదుల అనుసంధానం, సేంద్రీయ వ్యవసాయం వంటి పలు నమూనాలను ప్రదర్శించి వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ నరేందర్ గుప్తా, హనుమాన్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు విఠల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విజన్ టాలెంట్ స్కూల్‌లో..



# తవ్వారు.. రోడ్డు మరిచారు!

- ప్రమాదకరంగా అంతర్గత రహదారులు
- ప్రభుత్వం మారటంతో ఆగిన నిర్మాణ పనులు





అల్విన్‌కాలనీ: అంతర్గత రహదారులు శిథిలావస్థలకు చేరి పాదచారులు, వాహనదారులు ప్రాణ సంకటంగా మారుతున్నాయి. కూకట్‌పల్లి సర్కిల్ అల్విన్‌కాలనీ సాయినగర్ ఈస్ట్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనుల్లో భాగంగా రోడ్డును తవ్వి డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టి నెలలు గడుస్తున్నా.. రహదారి ప్యాచ్ వర్క్, సీసీరోడ్డు నిర్మాణ పనులను చేపట్టకపోవటంతో స్థానికులు రహదారిపై రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొంది. స్థానికంగా పాఠశాలలు, దేవాలయం, వృద్ధాశ్రమం ఉండటంతో ఈ రహదారిలో రోజూ రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రహదారి తవ్వి డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టినప్పుడు తవ్విన వ్యర్థాలను సైతం తరలించకపోవటంతో ఆ రహదారిలో రాళ్లు, సీసా పెంకులు, పెద్ద పెద్ద బండ రాళ్లు ఉండటంతో ఇళ్ల ముందు వాహనాలను కూడా పార్కింగ్ చేయలేని పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు.

**కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం..**

అధికారులు, ప్రజా ప్రతినిధుల పర్యవేక్షణ కారణంగా కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వదిలివేశారని స్థానికులు చెబుతున్నారు. డ్రైనేజీ పనులు చేపట్టినప్పుడే రహదారి నిర్మాణానికి కూడా ప్రణాళికలు చేపట్టి పనులను త్వరగా ముగించాల్సిన అధికారులు ఎన్నికల నెపంతో రహదారిని నిర్మించకుండా కాలయాపన చేశారని ఆరోపిస్తున్నారు. ఈ రహదారిలో వయోవృద్ధులు, చిన్నారులు, వాహనదారులు రాకపోకలకు ఇబ్బందికరంగా మారిందని పేర్కొంటున్నారు.

**ప్రమాదాలు జరిగిన సందర్భాలూ..**

గత కొద్ది రోజుల క్రితమే స్థానికంగా ఉన్న పాఠశాలకు చిన్నారులను తీసుకెళ్లటానికి ద్విచక్రవాహనంపై వెళ్లే వాహనదారుడు ఎదురుగా వచ్చిన వాహనాన్ని తప్పించబోయి రాళ్లు తగిలి క్రింద పడి గాయాలపాలైన ఘటనలు కూడా ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. గత ఎన్నికల ముందు త్వరలోనే రహదారి నిర్మాణ పనులను పూర్తి చేయటం జరుగుతుందని హామీ ఇచ్చి నెలలు గడుస్తున్నా.. ఇప్పటి వరకూ ప్రజా ప్రతినిధులు ఇటువైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు రహదారిని పరిశీలించి నిర్మాణ పనులు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## కస్టమర్ల అభిరుచికి అనుగుణంగా ఏ వన్ టీ



నల్లకుంట: టీ వినియోగదారుల మన్ననలతో ఏ వన్ టీ కంపెనీ దినదినాభివృద్ధిని సాధిస్తుందని ఏ వన్ టీ కంపెనీ డైరెక్టర్ జకీర్ అన్నారు. శనివారం కూకట్‌పల్లి మెట్రో పిల్లర్ నంబర్ 780 సమీపంలో 12వ నూతన ఔట్‌లెట్‌ను ప్రారంభించారు. కంపెనీ డైరెక్టర్ రఫియా పటేల్, జకీర్ పటేల్ మాట్లాడుతూ.. ఏ1 టీ కంపెనీ ఔట్‌లెట్ ప్రారంభించిన నేపథ్యంలో మొదటి 100 కస్టమర్లకు టీ పొడిని ఉచితంగా అందజేశారు. ప్రతి రూ. 100 కొనుగోలు కూపన్లపై ప్రతివారం లక్కీడ్రా తీస్తామన్నారు. నాలుగు వారాల పాటు లక్కీ డ్రా ఉంటుందని తెలిపారు. విజేతలైన వారికి 1 గ్రా. బంగారం కాయిన్ అందజేస్తామన్నారు.

## అలరించిన సంగీత కచేరి

మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమాస్వార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం పద్మశ్రీ శోభరాజు విద్యార్థిని గాయత్రి సింధూజ వేదుల సంగీత కచేరిని నిర్వహించారు. గణరాజగణరాజ, వందేహం గురుదేవ, అదిగో అల్లదిగో, అప్పమైన నీయరే, సకల బలంబులు, పొడగంటిమయ్య అంటు అన్నమయ్యకీర్తనలను ఆలపించి సందర్శకులను ఆకట్టుకున్నారు. కీబోర్డు సత్యదేవ్, బి.వి రమణామూర్తి వాయిద్య సహకారాన్ని అందించారు.

# రూ.10 లక్షలతో అభివృద్ధి పనులు



అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించిన కార్పొరేటర్ సతీష్‌గౌడ్

బాలానగర్: మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని ఇందిరాగాంధీపురంలో నిర్మించ తలపెట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనులను స్థానిక కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారీ వర్షాలకు అస్తవ్యస్తమైన డ్రైనేజీ స్థానంలో నూతన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 10 లక్షలతో నిర్మాణ పనులను చేపట్టినట్లు వివరించారు. వచ్చే వర్షాకాలం నాటికి డివిజన్ పరిధిలోని కాలనీల్లో డ్రైనేజీ సమస్య తలెత్తకుండా పనులను పూర్తి చేస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు. ఇప్పటికే పలు కాలనీల్లో డ్రైనేజీ పైపులైన్లను పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. నాయకులు ఇమ్రాన్, షౌకత్, సలీం, అన్వర్, నిసార్, సంతోష్, నూర్ తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్‌గాంధీ పంచాయితీరాజ్ సంఘటన్ సదస్సు



రాజీవ్‌గాంధీ పంచాయితీరాజ్ సంఘటన్ రాష్ట్ర సదస్సులో యాదగిరి తదితరులు

అల్విన్‌కాలనీ: గ్రామాలు, నగరాల బలోపేతం ద్వారానే అభివృద్ధి జరుగుతుందని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాషిపాక యాదగిరి పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ పంచాయితీరాజ్ సంఘటన్ రాష్ట్ర సదస్సు శనివారం జరిగింది. ఈ సదస్సులో ఖైరతాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి విజయ రెడ్డితో కలిసి వివేకానందనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బాషిపాక నాగమణి యాదగిరి, ఆల్విన్‌కాలనీ డివిజన్ అధ్యక్షుడు మారెళ్ల శ్రీనివాసరావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బసంత్‌రాజు, డాన్, వెంకటేష్, కర్క నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ స్వాతంత్ర్యం నాటి నుంచి నేటి వరకు ప్రజల అవసరాల దృష్ట్యా అనేక రకాల మౌలిక వసతులు, పథకాలు ప్రవేశపెట్టి పేదలకు దగ్గరైందన్నారు. పేదల కోసం విద్య, వైద్యం, వ్యవసాయం వంటి వాటిల్లో సైతం ముందు చూపుతో వ్యవహరించిందని అభిప్రాయపడ్డారు.

# జేఎన్‌టీయూకు 'న్యాక్' ఏ ప్లస్ గ్రేడ్

బాలానగర్: జేఎన్‌టీయూ యూనివర్సిటీ జాతీయ అంచనా, అక్రిడిటేషన్ కౌన్సిల్ న్యూఢిల్లీ సంస్థ (న్యాక్) ఏ ప్లస్ గ్రేడ్‌ను ప్రకటించిన సందర్భంగా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. సాంకేతిక విశ్వ విద్యాలయ సంస్థలకు ప్రతి ఏటా ఢిల్లీ నుంచి వచ్చే జాతీయ అంచనా, అక్రిడిటేషన్ కౌన్సిల్ కమిటీ గతేడాది జూన్ 26 నుంచి 28 వరకు నాలుగు బృందాలుగా జేఎన్‌టీయూ యూనివర్సిటీని పరిశీలించి జూలై 19, 2023న ఏ గ్రేడ్‌ను ప్రకటించారు. యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డా. కట్టా నర్సింహారెడ్డి యూనివర్సిటీలో ఉన్న సదుపాయాలు, పలు అంశాలను దృష్టిలో ఉంచుకుని న్యాక్ కమిటీ ప్రకటించిన ఏ గ్రేడ్‌ను పునఃపరిశీలన చేయాల్సిందిగా కమిటీకి విజ్ఞప్తి చేశారు. ఈ విజ్ఞప్తి మేరకు అన్ని సదుపాయాలు, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్, ల్యాబ్ సౌకర్యాలు, ఇతర పలు అంశాలను పరిశీలించిన న్యాక్ కమిటీ వారు ఏ ప్లస్ గ్రేడ్‌ను ప్రకటించారు. భవిష్యత్తులో యూనివర్సిటీని మరింత అభివృద్ధి చేసి, మరిన్ని సౌకర్యాలు అమలు చేసి మంచి గ్రేడ్ పొందేలా కృషి చేస్తామన్నారు. జేఎన్‌టీయూ యూనివర్సిటీ ఏ ప్లస్ గ్రేడ్ పొందడంపై రెక్టార్ డా. విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ డా.వేంకటేశ్వరరావు, పీఆర్‌ఓ ప్రసన్న, పలు డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్లు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నర్సింహ్మారెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

# నాణ్యత ప్రమాణాలతో అభివృద్ధి పనులు



వరద కాలువ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నే

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని జానకిరామ టవర్స్ వద్ద చేపడుతున్న వరదనీటి కాలువ నిర్మాణ పనులను జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి స్థానిక కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ.. హైదర్‌నగర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామన్నారు. వరద నీటి కాలువ వంటి నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేస్తామని వివరించారు. పనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను కోరారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, డివిజన్ ఉపాధ్యక్షుడు పోతుల రాజేందర్, కాలనీవాసులు హరి, చంద్రశేఖర్, కిరణ్, ఆదినారాయణ, కోటేశ్వరరావు, వెంకటకృష్ణ, భూషణ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు మహిళా దినోత్సవ వేడుకలు

మూసాపేట: మూసాపేట్‌లోని పటేదార్ భవనంలో ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు బ్రాహ్మణ సేవా సమాఖ్య అధ్యక్షురాలు విజయలక్ష్మి తెలిపారు. బ్రాహ్మణ సేవా సమాఖ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 3 గంటలకు ఉంటుందని ఆమె ప్రకటించారు.

## శివరాత్రి ఉత్సవాలకు ఆలయాల ముస్తాబు

మూసాపేట: భరత్‌నగర్ కాలనీలోని హరిహర క్షేత్రంలో ఈనెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు కృష్ణసూరి తెలిపారు. ఈనెల 7న సాయంత్రం 5 గంటలకు గణపతి పూజ, రుద్ర హోమం, 8న తెల్లవారు జామున 4.30 నుంచి కాశీ విశ్వేశ్వర స్వామికి భక్తులచే సామూహిక సంతధార అభిషేకాలు, రుద్రహోమం, అర్చనలు, రాత్రి 9.30 గంటలకు కాశీ విశాలాక్షి విశ్వేశ్వరస్వామి కల్యాణోత్సవం, అనంతరం మాన్యాశ పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, 9న నిత్యాభిషేకం, రుద్రహోమం పూజా కార్యాక్రమాలు ఉంటాయని, శివరాత్రి రోజు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్

మోతీనగర్: మూసాపేట డివిజన్ బబ్బుగూడలో మల్లారెడ్డి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ సందర్శించి వైద్యపరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మల్లారెడ్డి సేవా ట్రస్ట్, ఆస్పత్రి బస్తీల్లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సరైన సమయంలో వైద్య పరీక్షలు చేయించుకోలేక బస్తీల్లో నివాసం ఉండే పేద ప్రజలు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారన్నారు. అలాంటి వారు వైద్య సేవలకు దూరం కావొద్దని మల్లారెడ్డి సేవా ట్రస్టు వారు అందజేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, నాగుల సత్యం, బస్తీ అధ్యక్షుడు బోడ శ్రీనివాస్, మల్లారెడ్డి ఆస్పత్రి మేనేజర్ రవికిరణ్, విష్ణు, అక్బర్, అంజి, శివ, చిన్నా తదితరులున్నారు.

## మల్కాజ్‌గిరి ఎంపీగా అవకాశం కల్పించాలని వినతి



దీపాదాస్ మున్షీతో చంద్రశేఖర్‌రెడ్డి

కూకట్‌పల్లి: మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతూ.. శనివారం సీనియర్ కాంగ్రెస్ నాయకుడు డాకారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని కలిసి విజ్ఞప్తి చేశారు. 40 ఏళ్లుగా తాను కాంగ్రెస్ పార్టీలో ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదాల్లో పనిచేశానని ఆమెకు వివరించారు. దీనికి ఆమె సానుకూలంగా స్పందించారని తెలిపారు. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందని, దీనిలో భాగంగానే ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. ఆరు హామీలను కాంగ్రెస్ ఇచ్చిన నేపథ్యంలో ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని కోరారు.

## పర్యావరణంపై విద్యార్థుల 'ఎడ్యు ఎక్స్‌పో'

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని పాపారాయుడునగర్‌లోని భాష్యం లిటిల్ చాంప్స్ బ్రాంచ్‌లో 'ఎడ్యు ఎక్స్‌పో' శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జేఎన్‌టీయూ, మ్యాథ్స్ ప్రొఫెసర్ ఎంఎస్ రాజశేఖర్, సీఈఓ చైతన్య, జేసీఓ శిరీష, భాష్యం హైస్కూల్ ప్రిన్సిపాల్స్ శ్రీదేవి, సుధా మాధవి పాల్గొన్నారు. 'మానవ చర్యలతో ఈ భూమండలాన్ని ఎన్నో రకాలుగా కలుషితం చేశాం', 'వాయు, భూ, జల కాలుష్యం', 'ఈ-వేస్ట్, ప్లాస్టిక్ వినియోగం'తో 'జల కాలుష్యం' తదితర పలు అంశాలతో ప్రాజెక్టును ప్రదర్శించి అందరినీ ఆలోచింపజేశారు. మన సంస్కృతి, సాంప్రదాయం, వేదాలు, ఇంగ్లిష్ గ్రామర్, హిందీ, తెలుగు సాహిత్యం, మన హైదరాబాద్ చరిత్ర దాని గొప్పతనంపై విద్యార్థులు చక్కటి నమూనాలు తయారు చేసి వివరించారు. గణితశాస్త్రంలోని మెళకువలు, గణిత విషయాలను అద్భుతంగా వివరించారు.

## చెరువు సుందరీకరణ పనుల పరిశీలన..



కూకట్‌పల్లి: ఐడియల్ చెరువు సుందరీకరణ పనులను అన్ని విభాగాల అధికారులతో కలిసి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే చెరువు అభివృద్ధి కోసం రూ.19 కోట్లు కేటాయించామని చెరువు చుట్టూ.. ప్రజలకు ఉపయోగపడేలా వాకింగ్‌ట్రాక్, పార్కుతో పాటు విద్యుత్ దీపాలతో సుందరీకరణ చేసేందుకు ప్రణాళిక చేశామన్నారు. సగం మేర పనులు పూర్తి చేశామని వివరించారు. మిగిలిన పనులను త్వరగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎలాంటి ఇబ్బందులున్నా.. తన దృష్టికి తీసుకురావాలని, పనుల్లో జాప్యం చేయొద్దని సూచించారు. మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు, హెచ్ఎండీఏ, రెవెన్యూ, జీహెచ్ఎంసీ, ఇరిగేషన్, టౌన్‌ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ

కూకట్‌పల్లి: క్షత్రియ ఫెడరేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు విద్యార్థులకు కూకట్‌పల్లి పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు కంపాస్ బాక్స్, పరీక్ష ప్యాడ్‌సెట్‌ను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షత్రియ యూత్ ఫెడరేషన్ ప్రతి ఏటా విద్యార్థులను ప్రోత్సహించేందుకు వారికి చేయూతను అందించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉత్తమ ప్రతిభ కనబరిచి తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చి జీవితంలో ముందుకెళ్లాలని ఆకాంక్షించారు. శ్యామల రాజు, క్షత్రియ యూత్ ఫెడరేషన్ సభ్యులు సుధీర్‌వర్మ, భీమరాజు రాము, కూకట్‌పల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సంతోష్, సెక్రటరీ ప్రభాకర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.